క్లుప్తంగా

మొక్కలు నాటి సంరక్షించండి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీలోని సెంట్రల్ డివైడర్లపై శుక్రవారం మొక్కలు నాటి వన మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ కొండ్రు నర్సింహా, డాక్టర్ మట్టా దయానంద్, దోమ ఆనంద్, గాదె చెన్నారావు, ఎండీ కమల్ పాషా, ఉడతనేని అప్పారావు, పింగళి సామేలు, తోట సుజలరాణి, ఎస్కే నాగుల్‌మీరా, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ గవర్నర్‌కు సన్మానం



మొక్క నాటుతున్న లయన్స్‌క్లబ్ గవర్నర్ మన్మోహన్ దంపతులు

తల్లాడ: మండలంలోని నారాయణపురంలో శుక్రవారం లయన్స్‌క్లబ్ గర్నవర్ రేపాల మన్మోహన్, విజయలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం రేపాల మన్మోహన్ తల్లాడ రావటంతో లయన్స్‌క్లబ్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి జీఎస్ఆర్ గార్డెన్ నుంచి కార్ల ర్యాలీగా నారాయణపురం కోదండ రామాలయం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజలు చేసిన అనంతరం లూర్థుమాతా పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అనంతరం గవర్నర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కేవీ.ప్రసాద్, సతీష్‌కుమార్, పీజీడీజీలు చలవాది నగేష్, సాతులూరి సత్యనారాయణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావు, కర్నాటి లక్ష్మారెడ్డి, వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చింతకాని: మండలంలోని లచ్చగూడెం, ప్రొద్దుటూరు, సీతంపేట గ్రామాల్లోని లబ్ధిదారులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.3.71 లక్షల విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల నిరసన

సత్తుపల్లిటౌన్: కేంద్ర ప్రభుత్వం ఎనిమిదో వేతన సవరణలో చేస్తున్న మార్పుల్లో ఎటువంటి పెరుగుదల లేకపోవడంతో ఈ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం సత్తుపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రింగ్‌సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్‌పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు వై.కుంతరావు, ఎమ్మెస్సాఆర్ శర్మ, నాగేశ్వరరావు, సాయి, వెంకటేశ్వరరావు, రమేష్, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



రూ.లక్ష ఫిక్స్‌డిపాజిట్ పత్రాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కల్లూరురూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మండలంలోని ఎర్రబోయినపల్లికి చెందిన చిత్రాల సింధూర్(35) ఆత్మహత్య చేసుకున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో.. విషయం తెలుసుకున్న ఎర్రబోయినపల్లిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో తనతో పాటు పదో తరగతి చదివిన (2005) పూర్వ విద్యార్థులు మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. సింధూర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఇద్దరి పిల్లలమీద ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున కల్లూరు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ సర్టిఫికెట్లను కుటుంబ సభ్యులకు అందించారు.



తనికెళ్లలో నిర్మించిన తడి, పొడి చెత్త సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం



చిన్నమునగాలలో..

చెత్త రాదు.. ఎరువు కాదు!

- అలంకార ప్రాయంగా తడి, పొడి చెత్త సేకరణ కేంద్రాలు
- పట్టించుకోని జీపీ ఉద్యోగులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

కొణిజర్ల: స్వచ్ఛ గ్రామాలను ఏర్పాటు చేయాలని, జీపీల్లోని చెత్తను వేరుచేయడానికి సేంద్రియ ఎరువును తయారు చేయడానికి చేసి ఆర్థికంగా గ్రామాలను బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. ప్రతీ పంచా యతీలో గత ప్రభుత్వం రూ.లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు ఉపయోగంలో లేకుండా పోతున్నాయి.

మండలంలోని వివరాలిలా..

కొణిజర్ల మండలంలో మొత్తం 27గ్రామ పంచాయతీలున్నాయి. సుమారు 50కి పైగా హ్యాబిటేషన్లు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో చెత్త సేకరించి తడి – పొడి చెత్త వేరు చేసేందుకు ఉపాధిహామీ పథకం నిధులు రూ.12 లక్షల వ్యయంతో జీపీకి ఒకటి చొప్పున చెత్త సంపద కేంద్రాలు నిర్మించారు. మొదటి రెండు మూడేళ్లు చెత్త సేకరణ బాగానే జరిగింది. చెత్త సేకరించేందుకు ప్రతి పంచాయతీకి



కొణిజర్లలో ఆరుబయటే పడవేస్తున్న చెత్త

ఓ ట్రాక్టర్, జనాభాకు అనుగుణంగా మల్టీపర్పస్ వర్కర్ల పేరుతో పారిశుద్ధ్య కార్మికులను నియమించి నిత్యం వీధుల్లో తిరిగి చెత్త సేకరించారు. కొన్ని పంచాయతీలలో సేంద్రీయ ఎరువు కూడా తయారు చేసి రైతులకు విక్రయించారు.

అధికారుల నిర్లక్ష్యంతో..

గత కొన్ని ఏళ్లుగా జీపీల్లో పట్టించుకునే వారు లేక చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. జీపీలకు పాలక మండళ్లు లేక.. కేంద్ర నిధులు నిలిచిపోయి, రాష్ట్ర నిధులు అంతంత మాత్రంగా రావడంతో ట్రాక్టర్ల ఈఎంఐలు కట్టలేక, జీపీల్లో నిధులు లేక చెత్త సేకరణ నిలిపివేశారు. కొన్ని గ్రామాల్లో అక్కడక్కడ సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాల్లో వేయకుండా ఆరుబయట తగల బెట్టడంతో.. పర్యావరణం కాలుష్యం కూడా ఏర్పడుతుంది.

డంపింగ్ యార్డులను తలపిస్తున్న రోడ్లు..

నిధులు లేక పలు గ్రామాల ప్రజలు రోడ్లపైనే చెత్తను వేయడంతో.. రహదారులన్నీ డంపింగ్ యార్డులుగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొన్ని గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు మందు బాబులకు అడ్డాలుగా మారాయి. కావున, ఇకనైనా అధికారులు స్పందించి చెత్త సేకరణ చేపట్టాలని, తడి – పొడి చెత్తను వేరు చేసి.. సేంద్రీయ ఎరువు తయారు చేయిస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరి ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం..

సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉంటున్న విషయం వాస్తవమే. అయితే చెత్త సేకరణ చేయించమని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. నిబంధనలు పాటించాలని ప్రతీ సమావేశంలో సూచిస్తున్నాం. త్వరలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– ఉపేంద్రయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, కొణిజర్ల

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఏన్కూరు/చింతకాని: ఏన్కూరు మండలంలోని బురదరాఘవాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, చింతకాని మండలంలోని మత్కేపల్లి ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్‌నేరాలు, సేవింగ్స్ యొక్క ప్రాముఖ్యత, జీరోబ్యాలెన్సు అకౌంట్లు వంటి కీలక అంశాలతో పాటు ఇతర బ్యాంకింగ్ సేవల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నాగులవంచ బ్రాంచ్ మేనేజర్ అనీల్‌కుమార్, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రమేష్, పాఠశాల హెచ్‌ఎంలు సాగి సుజాత, శ్రీనివాసరావు, ఏన్కూరు గ్రామీణ వికాస్ బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏన్కూరు: అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ సిబ్బంది

వైద్య శిబిరం విజయవంతం



వైరా: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వైరా/చింతకాని: వర్షాకాలం అంటు వ్యాధులు ప్రబలకుండా వైరా మున్సిపల్ కార్యాలయం వారి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హర్ష నేతృత్వంలో వైద్య సిబ్బంది కాలనీ వాసులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సీహెచ్ వేణు మాట్లాడుతూ.. వానాకాలం అంటు వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉన్నందున ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా చింతకాని మండలంలోని కొదుమూరు గ్రామంలో మండల వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యశిబ్బంది రోగులను పరీక్షించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ జాన్సన్, మున్సిపల్ సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, రేఛల్‌రాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

చింతకాని: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి కానరాకుండా పోవడంతో ఆమె తల్లిదండ్రులు శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. యువతి తల్లిదండ్రులు గురువారం పొలం పనులకు వెళ్లి వచ్చేసరికి ఆమె కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు



బనిగండ్లపాడులో విద్యుత్ లైన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో ప్రమాదకంగా ఉన్న విద్యుత్ లైన్లను తొలగించి కొత్త లైన్లు వేశారు. నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటును శుక్రవారం వైరా డీఈ బండి శ్రీనివాసరావు, మధిర ఏడీఈ అనురాధ పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ఏఈ గణేష్, లైన్‌మెన్ రాజేష్, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ యన్నం పిచ్చిరెడ్డి, పెద్దగోపవరం సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.


పలువురికి పరామర్శ

పెనుబల్లి: మండల పరిధిలోని పలువురిని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మేడా భాస్కర్‌రావు పరామర్శించారు. అనంతరం పెనుబల్లిలో ఇటీవల మృతి చెందిన వేముల కృష్ణయ్య, చిల్లపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు కృష్ణారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, రామారావు, సీతారామారావు, కమలాకర్‌రావు, మాధవరెడ్డి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

సత్తుపల్లి: జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషనర్ వారి ఉత్తర్వుల మేరకు 2025–26 సంవత్సరానికి గాను కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్(02), హిందీ(01), హిస్టరీ(01), ఫిజిక్స్(01), జువాలజీ(01) పోస్టులకు సంబంధించిన అతిథి అధ్యాపకుల నియామకాలు 30-07-2025 తేదీ ఉదయం 10 గంటలకు ఎస్ఆర్‌అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ఖమ్మం నందు డెమో, ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు పీజీలో 55శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్/సెట్/పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు పూర్తి బయోడేటాతో పాటు జిరాక్స్ సర్టిఫికెట్లు జతచేసి అప్లికేషన్ జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సత్తుపల్లిలో అందించాలని తెలిపారు.

వంట పాత్రలు అందజేత



కొణిజర్ల: పాఠశాలలకు వంట పాత్రలు అందిస్తున్న ఎంఆర్‌సీ సిబ్బంది

ముదిగొండ/కొణిజర్ల: ప్రధానమంత్రి పోషణ్ పథకం కింద మధ్యాహ్న భోజనం పథకం కోసం మంజూరైన వంట పాత్రలను స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓలు డి.అబ్రహం, రమణయ్య, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి లు శుక్రవారం పంపిణీ చేశారు. ముదిగొండ మండలంలోని 46 పాఠశాలలకు, కొణిజర్ల మండలంలోని 42పాఠశాలలకు వంటపాత్రలు అందజేసినట్లు ఎంఈఓలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, వంట ఏజెన్సీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

కల్లూరురూరల్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ప్రవేశాలకు సంబంధించి పోస్టర్లు కల్లూరు తహసీల్దార్ పులి సాంబశివుడు శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక విజ్ఞాన్ స్కూల్ ఆధ్వర్యంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ ప్రవేశాలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞాన్ స్కూల్ నిర్వాహకులు కోరారు.


అండర్ డ్రెయినేజీ పనులతో ఇక్కట్లు

మధిర: మధిరలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణంలో భాగంగా తీసిన గోతులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈమేరకు నాయకులు శుక్రవారం పలుచోట్ల పనులను ప్రారంభించి మాట్లాడారు. అండర్ డ్రెయినేజీ పనులను నత్తనడకన జరుగుతుందని, దీంతో గోతులు తీసిన చోట మట్టి సరిగ్గా నింపకపోవడంతో వాహనాలు కూరుకుపోతున్నాయని చెప్పారు. ఈమేరకు అధికారులు స్పందించి పనులను పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరాజు సుమంత్, రామిశెట్టి నాగేశ్వరరావు, చిలువేరు సాంబశివరావు, స్వర్ణాకర్, కుంచం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు, జమలాపురం, ఎర్రుపాలెం గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్‌కార్డులను మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. అదే విధంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయికుమార్, నాయకులు పిచ్చిరెడ్డి, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అప్పారావు, బాబురావు తదితరులు ఉన్నారు.

ఘనంగా వైరా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



వైరాలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు తినిపిస్తున్న నాయకులు

వైరా/ఏన్కూరు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ జన్మదిన వేడుకలను శుక్రవారం వైరాలో ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ వైరా నియోజకవర్గ అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్, వైరా మండల అధ్యక్షుడు బొల్లం గోపీచంద్ ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యే దంపతులు కేక్ కట్ చేశారు. అదే విధంగా ఏన్కూరు మండలంలోని తిమ్మారావుపేట, ఏన్కూరు, ఆరికాయలపాడులో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టడంతో పాటు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు వెంకటేశ్వరావు, కృష్ణప్రసాద్, స్వర్ణ నరేందర్, భూక్యలాలు, దర్మారావు, ప్రభావతిరెడ్డి, నాగేశ్వరావు, నర్సింహరావు, వీరు నాయక్ పాల్గొన్నారు.

మాధారం ఎస్టీ కాలనీలోకి చేరిన వరద నీరు



మాధారం ఎస్టీ కాలనీలో మోకాళ్లలోతులో వరద నీరు

కారేపల్లి: మూడు రోజులుగా కురుస్తున్న వానలకు వరద నీరు రోడ్డుపై చేరటంతో పాటు, ఎస్టీ కాలనీలోని ఆవాసాల్లోకి చేరింది. దీంతో.. ఎస్టీ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు, సమీపంలో ఉన్న ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం చుట్టూ వరద నీరు చేరటంతో.. వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సబ్ సెంటర్‌కు రోగులు రావాలంటే వరద నీటిలో రావాల్సిన పరిస్థితి వచ్చిందని, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పై, ఆవాసాల్లో నిలిచిపోయిన వరద నీటిని తొలగించాలని కోరుతున్నారు.

అలుగు పోస్తున్న తొడితలగూడెం చెరువు

కారేపల్లి: మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షానికి కారేపల్లి మండలంలోని తొడితలగూడెం చెరువు గురువారం రాత్రి నుంచి అలుగు పోస్తుంది. తొడితలగూడెం చెరువు ఆయకట్టు కింద సుమారు 200 ఎకరాల్లో వరి పంటసాగు చేస్తుండగా.. చెరువు అలుగు పడటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తిండి గింజలకు కొదువ ఉండదని.. చెరువు అలుగు పోస్తుండటంతో అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై చేపలు పడుతూ నిరసన



రోడ్డుపై చేపలు పడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఏన్కూరు: మండలంలోని తిమ్మారావుపేట గ్రామ ప్రధాన రహదారి, మద్దులపల్లిరోడ్డుపై నిలిచిన వరదనీటిలో చేపలు పడుతూ గ్రామస్తులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, గత ఎన్నికల్లో రోడ్లను చూసి ఆవేదన చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ రోడ్లను బాగుచేయించాలని కోరారు.

వరద నీటిని పరిశీలిస్తున్న సీపీఎం బృందం



తాళ్లమడ ఎస్సీ కాలనీలోని రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని తాళ్లమడ గ్రామ పంచాయతీ దళితవాడలో డ్రెయినేజీలు అధ్వానంగా తయారయ్యాయని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ అన్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ బురదమయమై దుర్వాసన వెదజల్లుతుందన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) బృందం పరిశీలించి మాట్లాడారు. పాలకులు, అధికారులు స్పందించి తక్షణమే డ్రెయినేజీలు నిర్మించాలని, పలు డ్రెయినేజీల్లో పూడిక తీయించి, బ్లీంచింగ్ చల్లాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు దాసు, సీపీఎం నాయకులు ననందరావు, కన్నయ్య, వెంకటేశ్వరరావు, పున్నమయ్య, జగపతిరావు, ప్రసాద్, రాములు, పార్వతి పాల్గొన్నారు.

వర్షంతో జనజీవనానికి ఆటంకం..

- జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సత్తుపల్లిరూరల్: గత రెండు రోజుల నుంచి సత్తుపల్లి మండలంలో కురుస్తున్న వర్షంతో జనజీవనానికి ఆటకం ఏర్పడింది. తుఫాన్ ప్రభావంతో ప్రజలకు బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు అటవీ ప్రాంతాల నుంచి బేతుపల్లి పెద్దచెరువుకు భారీగా వరద చేరుకుంటుంది. గురువారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలో బొగ్గు ఉత్పత్తికి, రవాణాకు అంతరాయం ఏర్పడింది. కిష్టారం ఓసీలో 8వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 60వేల క్యూబిక్ మిలియన్ల మట్టి తొలగింపుకు అంతరాయం కలిగినట్లు ఓసీ పీఓ నర్సింహారావు తెలిపారు. అదే విధంగా జేవీఆర్ ఓసీలో 30వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 1.70 లక్షల క్యూబిక్ మిలియన్ల ఓబీ పనులకు అంతరాయం ఏర్పడినట్లు సింగరేణి అధికారులు తెలిపారు.

యూరియాపై ఆందోళన చెందొద్దు..



చింతకాని సొసైటీలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ మానస

చింతకాని: యూరియా నిల్వలు లేవని రైతులు ఆందోళన చెందొద్దని ఏఓ మానస అన్నారు. ×యూరియా కోసం రైతుల పాట్లు×శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం చింతకాని సొసైటీని ఏఓ సందర్శించి ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చింతకాని, నాగులవంచ సొసైటీల్లో రైతులకు కావల్సినంత యూరియా అందుబాటులో ఉందని, రైతులు తగిన సమయంలో వచ్చి అవసరం మేరకు యూరియా తీసుకోవాలని సూచించారు. రైతులెవరూ యూరియాను నిల్వ చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సందీప్, సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు, సొసైటీ వైస్ చైర్మన్ మాదినేని రవి, డైరెక్టర్ కిలారు మనోహర్‌బాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మధిర: మధిరలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం మొదలైన సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించాక అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యులు పూజలు చేయగా, పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కాగా, ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ప్రథమ అధ్యక్షుడు కోన జనార్దన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు కపిలవాయి జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం ఆలయంలో దాతల చేయూతతో అన్నదానం ఉంటుందని తెలిపారు. తొలిరోజు అన్నదాన కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు చారుగుండ్ల నరసింహమూర్తి – లక్ష్మి దంపతుల సహకారంతో ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కోనా జనార్దన్‌రావు, చారుగుండ్ల నరసింహమూర్తి, పల్లపోతు ప్రసాదరావు, కుంచం కృష్ణారావు, పబ్బతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైరా స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ప్రారంభం

వైరా: వైరాలో కళాకారులను క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో వైరాలో స్పోర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం వైరాలోని మజీద్ రోడ్డులో ఎస్‌వీఎస్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైరా సీనియర్ కళాకారులకు భగవద్గీత కంఠస్థ పోటీలలో బంగారు పతకాలు సాధించిన మహిళలను సత్కరించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కట్టా కృష్ణార్జునరావు, ఉపాధ్యక్షుడిగా నూతి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీగా చల్లా కృష్ణారావు, ట్రెజరర్ షేక్ పాషా, కార్యదర్శులుగా డి.కుటుంబరావు, వి.వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, టీజీకే రెడ్డి, వి.చక్రవర్తిలను ఎన్నుకున్నారు.

టీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులకు సన్మానం

కల్లూరు: తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యూజే) జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ మున్నాఫ్, ఉబ్బన బాబూరావులను.. ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, కాంగ్రెస్, సీపీఐ నాయకులు శుక్రవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్కే యాకూబ్ అలీ, బాల నాగేశ్వరరావు, దూబకుంట్ల మురళీ, కుంచాల గురవయ్య, ఉబ్బన దేవదాసు, ఉబ్బన రాంబాబు, సీపీఐ మండల కార్యదర్శి దామాల దయాకర్‌లు ఉన్నారు.

కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు రాయల శ్రీనివాసరావు, వేల్పుల భద్రయ్య

ముదిగొండ: కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ముదిగొండలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకానికి ప్రతి ఏటా నిధులు తగ్గిస్తూ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. వ్యవసాయ కార్మికసంఘం మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రాయల శ్రీనివాసరావు, వేల్పుల భద్రయ్యలను ఎన్నుకున్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు పురుషోత్తం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.